

మలక్‌పేట హరిహరక్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



శ్రీత్రివేణి స్కూల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



ఉట్టి కొట్టుతున్న చిన్నారి

కృష్ణుడి అల్లరి.. గోపికల సందడి





దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



రాధాకృష్ణ వేషధారణలో కవలలు యాషిక, యశ్న

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.శనివారం వేకువజాము నుంచే ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కోలాటాలు, వివిధ కార్యక్రమాలతో ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణలతో సందిడి చేశారు. వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఉట్లు కొట్టే కార్యక్రమాలు అలరించాయి. – ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం







వేడుకల్లో పాల్గొన్న పలు పార్టీల నాయకులు



మాదన్నపేట మార్కెట్ గోశాలలోని శ్రీ కృష్ణ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న సభ్యులు





రూ. 5 లక్షల విరాళం అందజేత



దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుత గృహమని ఇక్కడి విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందిస్తున్న గృహ కమిటీని అభినందించారు. అనాథ విద్యార్థుల చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, శశిమోహన్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, గుత్తా హరివంశరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

నాగోలు: శ్రీనివాసనగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయ సన్నిధిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో శనివారం సందర్భంగా అర్చకులు మోటుపల్లి లక్ష్మీ రామాచార్యులు స్వామికి సహస్ర అష్టోత్తర అరటిపండ్ల పూజ నిర్వహించారు.

టాయిలెట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న చిలుక నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో బీఓటీ పద్ధతిలో నిర్మిస్తున్న టాయిలెట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి సూచించారు. శనివారం ఆయన పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రూ. 15 లక్షలతో టాయిలెట్ పనులు జరుగుతున్నాయని త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. సూపర్‌వైజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అభినందన



నాగోలు: సామాన్య మానవుడికి సరైన సమయంలో న్యాయం జరిగినప్పుడు వృత్తికి న్యాయం చేసినట్లు అవుతుందని ప్రముఖ విశ్రాంత జడ్జి నేరెళ్ల మాల్యాద్రి అన్నారు. కొత్తపేట డివిజన్ స్నేహిపురి కాలనీలో కొమ్రరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానిస్టిట్యూషన్ లా సబ్జెక్టులో బంగారం పతకం సాధించిన సంగీత లక్ష్మిని శనివారం ఆయన అభినందించి మాట్లాడారు. సామాన్య ప్రజలకు సేవచేసే అవకాశం న్యాయవాది వృత్తిలో ఉన్నవారికి ఎక్కువగా ఉంటుందన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



హస్తినాపురం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధి నందనవనం కాలనీలో పయనీర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. వైద్యం చేయించుకోలేని నిరుపేద ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనుమతి లేని స్పా సెంటర్లపై పోలీసుల దాడి

చైతన్యపురి: అనుమతి లేకుండా నడుపుతున్న స్పా సెంటర్లపై చైతన్యపురి పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా స్పా సెంటర్లు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు వాసవి కాలనీలోని మోజో వెల్‌నెస్ స్పా, కొత్తపేట వీఎం హోం మెట్రో స్టేషన్ సమీపంలోని స్కై బ్యూటీ స్పా, న్యూనాగోల్ ప్రభాత్‌నగర్‌లోని ఏ పీస్‌ఫుల్ ఫ్యామిలీ సెలూన్ అండ్ స్పా, సాయినగర్ కాలనీలోని బ్రైట్‌నెస్ బ్యూటీ స్పా, అల్కాపురిలోని శ్రీఎలైట్ స్పా అండ్ అండ్ సెలూన్, నాగోలు చౌరస్తాలోని విజెరిజోన్ స్పా తదితర సెంటర్లను తనిఖీ చేయగా అనుమతులు లేనట్లు గుర్తించామన్నారు. నిర్వాహకులతో పాటు, సిబ్బంది, పలువురు యువతులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. హస్తినాపురం డివిజన్ పరిధి సాయిప్రకాశ్‌నగర్‌కాలనీలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. అ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు పెంచటం ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండటం గొప్పవరం

హయత్‌నగర్: ప్రస్తుతం ఆహార అలవాట్ల కారణంగా ప్రతి ఒక్కరు అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఆరోగ్యంగా ఉండటంతో గొప్ప వరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హయత్‌నగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి ఇండోర్ ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు జిమ్‌కు వెళ్లడం అలవాటుగా చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రజలకోసం పలు చోట్ల జిమ్‌లను ఏర్పాటు చేశామని ఇండోర్ ఓపెన్ జిమ్ ఇదే మొదటిదన్నారు. ఈ కార్యక్రమంలో సామ తిరుమల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సింగిరెడ్డి మల్లీశ్వరిరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, మల్లేష్, రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లో మురుగు పరుగు



శ్రీరమణ కాలనీ రహదారిపై పారుతున్న మురుగు

ఎల్‌బీనగర్: హస్తినాపురం డివిజన్ పరిధి శ్రీరమణ, రెడ్డికాలనీ వంటి పలు లోతట్టు ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి పూడికతీత, విస్తరణకు నోచుకోని ఓపెన్ నాలాలు, తెరుచుకున్న మ్యాన్‌హోళ్లతో కాలనీలు దుర్గంధంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు మ్యాన్ హోళ్ల నుంచి ఉబికి వస్తున్న మురుగుతో దోమలు, ఈగలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

వాజ్‌పేయి జీవితం ఆదర్శప్రాయం



కొత్తపేటలో నివాళి అర్పిస్తున్న సామరంగారెడ్డి, పవన్‌కుమార్

నాగోలు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం అందరికీ ఆదర్శమని బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామా రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శనివారం అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

చంద్రపురికాలనీలో..

మన్సూరాబాద్: అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో సామ రంగారెడ్డి పాల్గొని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, కృష్ణంరాజు, విద్యాసాగర్, గంగదాసు కృష్ణారెడ్డి, ఎలే పురేందర్‌నేత పాల్గొన్నారు.

కృష్ణతులసినగర్ కమ్యూనిటీహాల్లో..

మలక్‌పేట: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విప్లవాత్మక నిర్ణయాలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కృష్ణతులసినగర్ కమ్యూనిటీహాల్లో శనివారం నిర్వహించిన వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, సురేందర్, జక్కా మోహన్ రెడ్డి, వరప్రసాద్, రంజిత్, ప్రవీణ్, రాంచందర్, లక్ష్మణ్, దినేష్, పరశురామ్ పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



ఎల్‌బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో..

నేడు మాదన్నపేట మండీలో బోనాలు

చంచల్‌గూడ: శ్రావణమాసం సందర్భంగా మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లోని భూలక్ష్మీ ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నారు. మండీలోని కూరగాయల వ్యాపారులు సామూహికంగా బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. సోమవారం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.39, వంకాయ రూ.23, బెండ రూ.45, పచిమిర్చి రూ.45, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.45, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.31, మునగ రూ.23, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.18, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.43. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

యాదవులకు ప్రత్యేక రెజిమెంట్లు కల్పించాలి

నాగోలు: భారత- చైనా యుద్ధం (1962) లో వీరమరణం పొందిన 114 మంది యాదవ శౌర్య యోధుల వీరత్వాన్ని స్మరించుకుంటూ అఖిల భారత యాదవులు నిర్వహించే యాత్రనే రెజింగ్ల రాజ్ కలశ యాత్ర అంటారని అఖిల భారత యాదవ మహాసభల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ అన్నారు. శనివారం యాత్రను శుభం కన్వెన్షన్ నుంచి మన్సూరాబాద్ డివిజన్ మీదుగా అల్కాపురి లోని శ్రీకృష్ణ మందిర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులకు ప్రత్యేక రెజిమెంట్లు కల్పించాలన్నారు. ఈ కలశ యాత్ర నవంబర్ 18వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ముగుస్తుందన్నారు. యాదవుల ఆహిర్ (యాదవ) రెజిమెంట్ పునఃస్థాపన కోసం యాత్రలు చేస్తున్నామన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన యాదవ వీరుల త్యాగాలను స్మరిస్తూ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లే మహోత్తర కృషిగా ఈ యాత్ర సాగుతుందన్నారు. సురేందర్ యాదవ్, కిరణ్ కుమార్ యాదవ్, వివిధ సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

గుడిసెలు ఖాళీ చేయాలని బెదిరింపులు

సీఎం, కలెక్టర్‌కు లేఖలు

నాగోలు: బండ్లగూడ పరిధిలోని ఫతుల్లాగూడ డీఎస్‌ఆర్‌నగర్ (సర్వేనెంబర్ 58)లో గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లతో గుడిసెలు వేసుకొని ఉంటున్న వారిని ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు బెదిరిస్తూ దాడులు చేస్తున్నారని బాధితులు ముఖ్యమంత్రి, మేడ్చల్ జిల్లా కలెక్టర్, రాచకొండ పోలీస్ కమిషనర్‌కు లేఖలు పంపించారు. బాధితుల వివరాల ప్రకారం.. సర్వేనెంబర్ 58లో అర్బన్ హాట్స్ స్లమ్ డెవెలర్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ ఇస్మాయిల్ భార్య ఎంపీ ఫాతిమాబీ, మరో సర్టిఫికెట్ రజియాబీ పేరుతో గతంలో ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారు. వీరి కుటుంబ సభ్యులు ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అక్కడ ఇళ్ల నిర్మాణం చేసుకోలేదు. అక్కడ చిన్నపాటి గుడిసె వేసుకొని ఉంటున్నారు. అయితే.. స్థానికులు కొంతమంది ఈ స్థలం అసోసియేషన్‌కు చెందిన స్థలమని కలెక్టర్, ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు ఈ స్థలం ఖాళీ చేయాలంటూ అక్కడున్న వారిని బెదిరిస్తున్నారు. గత నెల 28 ఉప్పల్‌కు చెందిన ఓ రెవెన్యూ అధికారి కత్తితో బెదిరించినట్లు బాధితులు ఆరోపించారు. బెదిరించిన వీడియోలు కూడా ఉన్నాయని ఈ నెల 14న మరోసారి దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఎం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.